క్లుప్తంగా

'ప్రైవేటు'లో ఫీజుల దోపిడీ అరికట్టాలి


డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న రంజిత్

సిరిసిల్ల టౌన్: ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీని పూర్తిగా అరికట్టాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అంగూరి రంజిత్ కోరారు. విద్యారంగ సమస్యలపై సో మవారం సిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జి డీఈవో వినో ద్‌కు వినతిపత్రం అందించి మాట్లాడారు. పాఠశాలల్లోనే యూనిఫామ్స్, పుస్తకాలు అమ్ముతూ..అధిక ఫీజులు వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. నిబంధనలు అతిక్రమిస్తున్న విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకో వాలని లేకపోతే పెద్దఎత్తున పోరాటాలు చేస్తామన్నారు. జిల్లాలోని విద్యారంగ సమస్యలు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై వినతిపత్రం ఇచ్చినట్లు పేర్కొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన


అవగాహన సదస్సులో పాల్గొన్న వైద్యాధికారులు

గంభీరావుపేట: మండలంలోని సముద్రలింగాపూర్‌లో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆవరణలో సోమవారం క్షయవ్యాధి నిర్మూలనపై వైద్యాధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధానమంత్రి టీబీ ముక్త్‌భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి, సీహెచ్‌వో రమేశ్, ఎంఎల్‌హెచ్‌పీ అనూష, హేమ, హెల్త్ సూపర్‌వైజర్లు సీత మహాలక్ష్మీ, వైద్య సిబ్బంది నాగరాజు, సురేశ్, ప్రకాశ్, ఏఎన్ఎం జ్యోతి, రాజేశ్వరి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రాల్లో వసతులు కల్పిస్తాం

సాక్షి స్పందన

ముస్తాబాద్: ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్యాధికారి రజిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాక్షిలో 'వసతులు లేక ఇబ్బంది' శీర్షికన సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తెర్లుమద్ది, నామాపూర్, పోతుగల్, ఆవునూర్ ఉపకేంద్రాల్లో అన్ని వసతులు కల్పిస్తామని, వైద్య సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామ పంచా యతీ సిబ్బంది ఆయా గ్రామాల్లో ఉప కేంద్రాల్లో పారిశుధ్య చర్యలకు సహకరించాలని కోరారు.

చెత్త తొలగించాలి



రుద్రంగి: పారిశుద్ధ్యం అస్తవ్యస్తం అనే శీర్షికన ఇటీవల సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం రుద్రంగి కళాశాల ఆవరణలో చెత్త పడవేసిన పరిసరాలను ఎంపీడీవో నట్రాజ్, ఎంపీవో రాజేశ్వర్ గౌడ్ పరిశీలించారు. మట్టి కుప్పలు పోసిన ట్రాక్టర్ యజమానులు, చెత్తవేసిన వారు వాటిని తొలగించాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశాల్లో ప్రజలకు ఇబ్బందులు కలిగేలా మట్టి, చెత్త పడివేస్తే చర్యలు తప్పవన్నారు.

ఇందిరమ్మ ఇంటి స్థలం ఇప్పించండి


ఇందిరమ్మ ఇంటి స్థలం పట్టా చూపుతున్న శారద

ఎల్లారెడ్డిపేట: మండలానికి చెందిన పాలాస శారద తనకు పదేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మ ఇంటి స్థలాన్ని కొంత మంది ఆక్రమించుకున్నారని సోమవారం అధికారులకు ఫిర్యాదు చేసింది. గత ప్రభుత్వం వంద గ జాల స్థలాన్ని ఇందిరమ్మ కాలనీలో కేటాయిస్తూ పట్టా ఇచ్చారని తెలిపింది. ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడంతో ఇంటిని కట్టుకోలేక పో యానన్నారు. ఇప్పుడు ఆ స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు వెళ్లగా ఆస్థలాన్ని ఇతరులకు కే టాయించినట్లు పంచాయతీ సిబ్బంది చెబు తున్నారన్నారు. తనకుస్థలాన్ని ఇప్పించి న్యాయం చేయాలని ఈవో ప్రవీణ్‌కు విజ్ఞప్తి చేసింది.

పేకాటరాయుళ్లపై కేసు

గంభీరావుపేట: మండలకేంద్రంలోని పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేశారు. పేకాటాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని, రూ.8,200 నగదు, మూడు సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రేమానందం తెలిపారు.

మురుగు నీరు.. కదలని తీరు


పెద్దూరులో రోడ్డుపై నిలిచిన మురుగునీరు


ఇంటి పక్కన గుంతలో నిలిచిన మురుగునీరు

- శివారు కాలనీల్లో డ్రైనేజీలు లేక ఇళ్ల మధ్య నిలుస్తున్న మురుగునీరు
- దుర్గంధం వ్యాపిస్తున్నా పట్టించుకోని అధికారులు
- రోగాలబారిన ప్రజలు

సిరిసిల్ల అర్బన్ : పట్టణ పరిధిలోని విలీన గ్రామాల్లో స్వచ్ఛత పాటించి ప్రజలకు ఆరోగ్యాన్ని అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామాల్లో సీసీరోడ్లు నిర్మించి, డ్రైనేజీల నిర్మాణాలకు రూ. లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తోంది. గుత్తేదారులు మాత్రం సీసీరోడ్లు నిర్మించి డ్రైనేజీల నిర్మాణాలను మరిచారు. దీంతో శివారు కాలనీల్లో పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మురుగుకాల్వలు లేక మురుగు ఇళ్ల మధ్య నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మురుగు నీటి నిల్వలతో దోమల వృద్ధిచెంది ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేక పారిశుధ్య పనులు గాడి తప్పుతున్నాయి. సిరిసిల్ల పట్టణ పరిధిలోని చంద్రంపేట, జ్యోతినగర్, రాజీవ్‌నగర్, ముష్టిపల్లి, పెద్దూరు, బోనాల తదితర గ్రామాల్లోని పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. దీంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. చంద్రంపేట, రగుడు, ముష్టిపల్లి, రాజీవ్‌నగర్ తదితర గ్రామాల్లో సీసీరోడ్లు నిర్మించారు. కానీ మురుగుకాల్వల నిర్మాణం చేపట్టకపోవడంతో ఇంటికో మురుగు కాల్వ గుంతలు దర్శనమిస్తున్నాయి.

మురుగంతా రోడ్డుపైకి వస్తోంది



పట్టణ పరిధిలోని రాజీవ్‌నగర్‌లో డ్రైనేజీల నిర్మాణం లేకపోవడంతో ఇళ్లలోని నీరంతా రోడ్డుపైకి వస్తుంది. అక్కడక్కడ గుంతల్లో చేరి మురుగునీరు నిల్వ ఉండడంతో దుర్వాసనతోపాటు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో గ్రామస్తులు రోగాలబారినబారిన పడుతున్నారు.

– మామిడాల ప్రవీణ్ ,రాజీవ్‌నగర్

డ్రైనేజీలు నిర్మించాలి



ముష్టిపల్లి రాజీవ్‌నగర్ కాలనీలో సీసీ రోడ్లు వేశారు. డ్రైనేజీలు నిర్మించకపోవడంతో వర్షం పడినా, ఇళ్లలో వాడిన మురుగునీరంతా రోడ్లపైకి వచ్చి చేరుతుంది. దీంతో దోమలు వృద్ధి చెంది స్థానికులు రోగాలబారిన పడుతున్నారుర. కనీసం దోమల నివారణకు ఫాగింగ్, దోమల మందు పిచికారీ చేయాలి.

– నర్మెట ప్రేమల, రాజీవ్‌నగర్

భూ భారతితో భూ సమస్యలు పరిష్కారం


బోయినపల్లిలో రైతులనుంచి దరఖాస్తులు తీసుకుంటున్న అధికారులు


ఎల్లారెడ్డిపేట : అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

బోయినపల్లి: భూభారతి రెవెన్యూ సదస్సులతో రైతుల భూ సమస్యలు పరిష్కారమువుతాయని ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేశ్‌యాదవ్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో సోమవారం భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు భూ భారతి రెవెన్యూ సదస్సులు వినియోగించుకోవాలని కోరారు. డిప్యూటీ తహసీల్దార్ భూపేశ్, ఆపరేటర్ అనిల్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: భూభారతిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి డెప్యూటీ తహసీల్దార్ మురళీ కృష్ణ అన్నారు. ఎల్లారెడ్డిపేట గ్రామపంచాయతీ ఆవరణలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. రైతుల నుంచి పెద్దసంఖ్యలో దరఖాస్తులు వస్తున్నట్లు తహసీల్దార్ ఎంఏ ఫారుఖ్ తెలిపారు. వంతడుపులలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 75 దరఖాస్తులు, సోమారంపేటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 38 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు శశి, సంతోష్, వీఆర్వో సింగారెడ్డి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రవేశాలకు ఎంపిక పరీక్ష

వేములవాడ అర్బన్: వేములవాడ అర్బన్, రూరల్ మండలాల విద్యార్థులు, స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతిలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఎంపిక పరీక్ష (సెలెక్షన్ ట్రయల్స్) ఈనెల 18 న నిర్వహించనున్నట్లు వేములవాడ అర్బన్,రూరల్ మండల విద్య అధికారులు భూక్యా బన్నాజీ, కిషన్ తెలిపారు.ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉదయం 9 గంటల నుంచి సెలక్షన్ ఉండగా అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు వ్యాయామ ఉపాధ్యాయుడు హమీద్ పీడీ 9133947242, రమేశ్ పీడీ 8106706793 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పాఠశాలల్లో మూడో తరగతి చదివి నాలుగో తరగతి అడ్మిషన్ సంబంధించి స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్ ఈనెల 18న నిర్వహించనున్నట్లు ఎంఈవో కృష్ణహరి తెలిపారు. స్పోర్ట్స్ స్కూల్ కోసం ఆన్‌లైన్‌లో అప్లై చేసిన విద్యార్థులు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని తెలిపారు.

సమయానికి బస్సులు నడపాలి


డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రిన్సిపాల్

వీర్నపల్లి: పాఠశాల సమయానికి అనుకూలంగా బస్సులు నడపాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ అశోక్ సిరిసిల్ల డిపో మేనేజర్ ప్రకాశ్‌రావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. సమయానికి బస్సులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనికి మేనేజర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. పీడీ ప్రతాప్ కుమార్ ఉన్నారు

ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలకు..

- కోనరావుపేట బడిబాటలో 72 అడ్మిషన్లు


కోనరావుపేటలో పాఠశాలలో చేర్పిస్తున్న మాజీ జెడ్పీటీసీ

కోనరావుపేట: మండలకేంద్రంలోని పీఎంశ్రీ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో 72 నూతన అడ్మిషన్లు వచ్చినట్లు ప్రధానోపాధ్యాయుడు అజ్మీరా మదన్‌లాల్ తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న వసతులు, విద్యాబోధన గురించి తల్లిదండ్రులకు వివరించగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు ముందుకొచ్చారు. మాజీ జెడ్పీటీసీ గొట్టె రుక్మిణి తన మనవడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ఇలా మొత్తం 72 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాల నుంచి ప్రభుత్వ పాఠశాలలో చేరారు. వారందరికీ సోమవారం అడ్మిషన్లు ఇచ్చారు. ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, భాస్కర్, రాము, వెంకటేశ్, సంజీవ్, శృతి, అనూష, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కనగర్తిలో..

కనగర్తి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సయ్య ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉండాలి

ముస్తాబాద్: పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈవో నిమ్మ రాజిరెడ్డి అన్నారు. మండలకేంద్రంలో హెచ్‌ఎంలు, స్కావెంజర్లకు సోమవారం అవగాహన కల్పించారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు, స్కావెంజర్లు బాధ్యతతో పాఠశాల ఆవరణలో చెత్త, నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. మధ్యాహ్న భోజన నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. నీరు కలుషితం కాకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. రిసోర్స్‌పర్సన్ శివశంకర్, ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

బడిని బతికించండి సారూ..


నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

గంభీరావుపేట: ఉపాధ్యాయులను కేటాయించి బడిని బతికించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. గంభీరావుపేట మండలం రాజుపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎదుట సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన తెలిపారు. బడిలో 40 మందికి పైగా విద్యార్థులున్నా ఒక్క టీచర్ మాత్రమే ఉండడంపై తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ టీచర్ సెలవు పెట్టినా.. మీటింగ్‌లకు వెళ్లినా.. మా పిల్లల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఉపాధ్యాయులు లేకపోతే మా పిల్లలను సర్కార్ బడికి ఎలా పంపేదని ప్రశ్నించారు.

సంక్షిప్త వార్తలు

● ఇందిరమ్మ గ్రామ కమిటీలను రద్దు చేయాలి

గంభీరావుపేట: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు ఏర్పాటు చేసిన ఇందిరమ్మ గ్రామ కమిటీలను వెంటనే రద్దు చేయాలని, గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేస్తూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ మేరకు ఎంపీడీవో రాజేందర్‌కు వినతిపత్రం అందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నాయకులు డబుల్ బెడ్ రూం ఇళ్ల పేరిట అవినీతికి పాల్పడిన విధంగానే ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ ఇందిరమ్మ గ్రామ కమిటీల పేరిట అవినీతికి పాల్పడుతోందని ఆరోపించారు. అమాయక ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తూ ఇళ్లు మంజూరు చేస్తున్నారని విమర్శించారు.మండలశాఖ అధ్యక్షుడు కోడె రమేశ్, నాయకులు వాజీద్ హుస్సేన్, దేవేందర్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, మల్లేష్, విగ్నేష్, దేవేందర్, నర్సింలు, శ్రీనివాస్, ప్రశాంత్, స్వామి, దుర్గేష్, శ్రీధర్, భాస్కర్, రాజేశ్, ప్రశాంత్‌రావు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

● మంత్రిని కలిసిన మండల నాయకులు

బోయినపల్లి: వేములవాడ పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ మైనార్టీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి సోమవారం మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి బొకేలు అందించారు. కార్యక్రమంలో మండల సెస్‌డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, సంబ లక్ష్మిరాజం, ఏనుగుల కనుకయ్య తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: వేములవాడ దర్శనానికి వచ్చిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను ఎల్లారెడ్డిపేట కాంగ్రెస్ మండల నాయకులు కలిశారు. మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు కప్పి పుష్పగుచ్ఛం అందించారు. నాయకులు సద్ది లక్ష్మారెడ్డి, దొమ్మాటి నర్సయ్య, గుండాడి రాంరెడ్డి, షేక్ గౌడస్, చెన్ని బాబు, బండారి బాల్‌రెడ్డి, రవిగుప్తా, మెండే శ్రీనివాస్ యాదవ్, బుచ్చాగౌడ్‌లు ఉన్నారు.

● బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి

ఇల్లంతకుంట: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని మండల బీసీ సాధికారిత అధ్యక్షుడు గజ్జల రాజశేఖర్ గౌడ్ కోరారు. మండలకేంద్రంలో ఆయన సోమవారం మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన 42 శాతం బీసీలకు రిజర్వేషన్ ప్రకారం సర్పంచ్ ,ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎన్నికల్లో రిజర్వేషన్ అందించాలన్నారు.

● ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

సిరిసిల్ల అర్బన్: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకోవాలని కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ అన్నారు. సోమవారం పట్టణంలోని 33వ వార్డు బీవైనగర్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లబ్ధిదారులు ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలన్నారు. నాయకులు స్వర్గం రాజు, గాజుల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

● రెవెన్యూ సిబ్బంది దురుసు ప్రవర్తన ?

రుద్రంగి: ప్రభుత్వం భూ భారతి చట్టం భూ సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుండగా కొందరు రెవెన్యూ సిబ్బంది రైతులు, ప్రజలతో దురుసుగా ప్రవర్తిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. సోమవారం రుద్రంగి తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వద్ద పలు వివరాలు తెలుసుకునేందుకు వెళ్లగా వెనుక బోర్డు చూసుకోండి డీటీ ఎవరనేది తెలుస్తుంది అని దురుసుగా ప్రవరించారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ప్రజలతో సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానాలు చెప్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై రుద్రంగి తహసీల్దార్ పుష్పలతను ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేరు.



సిరిసిల్ల: పట్టణ ప్రజలకు దశాబ్దాల పాటు తాగునీరు అందించిన నీళ్ల ట్యాంకర్ ఇలా మూలనపడింది. విద్యానగర్ పంప్‌హౌజ్ పక్కనే వదిలేశారు. ఈ ట్యాంకర్‌ను విక్రయిస్తే కనీసం మున్సిపాలిటీకి ఆదాయం వస్తుంది. కానీ అధికారులు పట్టించుకోకుండా స్క్రాప్‌ను వదిలేయడంతో నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వృథాగా మూలనపడేసిన నీళ్ల ట్యాంకర్‌ను విక్రయించేందుకు చర్యలు తీసుకోవాలి. లేకుంటే తుప్పుపట్టిపోయే అవకాశం ఉంది.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
మున్సిపల్ కమిషనర్: పి.వాణి, సెల్‌నంబర్ : 9849905879

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసం


వేములవాడ : వట్టెంల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం


ఇల్లంతకుంట : ఎర్నాస్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో..

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం లింగంపల్లి, వట్టెంల పాఠశాలల్లో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం లింగంపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. బడిబాట భాగంగా లింగంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఒకేరోజు 38 మంది విద్యార్థులు చేరిక జరిగింది. వట్టెంలలోని అంగన్‌వాడీ కేంద్రం -1లో అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం, హెచ్‌ఎం శ్రీకాంత్‌రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఊరడి రవి, లింగంపల్లి పంచాయతీ సెక్రెటరీ ప్రేమ్ కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెరుకు శంకర్, అంగన్‌వాడీ టీచర్ వాణిశ్రీ, గ్రామస్తులు టీచర్లు ఐకేపీ వీవోఏలు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని ఎర్నాస్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించినట్లు మండల విద్యాధికారి సీహెచ్ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మూడేళ్ల తర్వాత మూతపడ్డ పాఠశాలను తెరిచామని, 18 మంది విద్యార్థులు నూతనంగా ప్రవేశం పొందినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, ఉపాధ్యాయుడు అశోక్, అంగన్‌వాడీ టీచర్ ఐలవ్వ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. వంతడుపులలోని అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు అక్షరాభ్యాసం చేశారు. ప్రధానోపాధ్యాయురాలు స్వప్న రాణి, అంగన్‌వాడీ టీచర్ కట్ట పద్మశ్రీ, తదితరులున్నారు.

కోనరావుపేట: మల్కపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గీత భారతి, శ్యామ్, గుండమనేని మహేందర్ రావు, ఏఏపీసీ చైర్మన్ సౌజన్య, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందిస్తున్నామని హెచ్ ఎం శిరీష అన్నారు. మండలంలోని అంబేడ్కర్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ వినయ కుమారి, ఉపాధ్యాయులు విద్యార్థులు ఉన్నారు.

అందుబాటులోకి రైతునేస్తం

- అదనంగా మరో 22 వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లు


మూడపల్లిలో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న రైతులు

చందుర్తి: వ్యవసాయరంగంలో వస్తున్న మార్పులను రైతులకు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతునేస్తం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో ప్రథమంగా 13 రైతువేదికల్లో ఈ వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లను ఆరు నెలల క్రితం ప్రారంభించింది. నూతనంగా మరో 22 రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లను అమలు చేసేందుకు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. కాగా నూతనంగా ప్రారంభించిన 22 కేంద్రాల్లోనూ మంగళవారం నుంచే రైతునేస్తం నిర్వహించనున్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు.

రైతులకు సలహాలు.. సూచనలు

వివిధ రకాల పంటల సాగుపై అవగాహన కల్పించేందుకు జిల్లాలో 35 వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రతీ మంగళవారం రైతువేదికల్లో నిర్వహించే రైతునేస్తం ద్వారా రైతులు పంటల సాగులో పాటించాల్సిన జాగ్రత్తలు, నూతన సాంకేతికతపై అవగాహన కల్పించనున్నారు.

అదనంగా రెండు యూనిట్లు



రైతునేస్తం నిర్వహించేందుకు గతంలో చందుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో మాత్రమే అవకాశం ఉండేది. రైతునేస్తం కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చందుర్తి మండలంలోని మర్రిగడ్డ, మూడపల్లి క్లస్టర్లలో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లను సోమవారం ప్రారంభించాం.

– అనూష, వ్యవసాయాధికారిణి, చందుర్తి

హైదరాబాద్‌కు తరలిన బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల: సిరిసిల్ల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం ఏసీబీ అధికారుల ముందు విచారణకు హాజరుకానుండగా జిల్లా నుంచి బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. నియోజకవర్గం నుంచి 25 వాహనాల్లో, వేములవాడ నియోజకవర్గం నుంచి ఐదు వాహనాల్లో బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. సిరిసిల్ల పట్టణంతో పాటు, తంగళ్లపల్లి, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట మండలాల నుంచి మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు, మాజీ ఎంపీపీలు, మాజీ ఎంపీటీసీ, మాజీ ఏఎంసీ చైర్మన్లు, సింగిల్ విండో చైర్మన్లు, మాజీ సర్పంచులు, సభ్యులు వాహనాల్లో తరలివెళ్లారు. వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆధ్వర్యంలో నాయకులు తరలివెళ్లారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం నుంచి ఆ పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. కేటీఆర్‌కు మద్దతుగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగా కేటీఆర్‌కు నోటీసులు ఇచ్చిందని వారు ఆరోపించారు. సహకార సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, అందె సుభాష్ తదితరులున్నారు.